నమస్తే తెలంగాణ
జగిత్యాల
6 | కరీంనగర్, ఆదివారం 20 ఏప్రిల్ 2025 | JAGTIAL

సమ్మక్క జాతరలా సభ

- మానకొండూరు నియోజకవర్గం నుంచి 10 వేల మందిని తరలిస్తాం
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్ : వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్/గన్నేరువరం, ఏప్రిల్ 19 : ఈ నెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సమ్మక్క సారలమ్మ జాతరను తలపించేలా ఉండనున్నదని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్పష్టం చేశారు. శనివారం తిమ్మాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి గెస్ట్‌హౌస్, గన్నేరువరం మండలకేంద్రంలో వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సభకు మానకొండూర్ నియోజకవర్గం నుంచి 10 వేలు, తిమ్మాపూర్ మండలం నుంచి 2 వేలు మందిని తరలిస్తామన్నారు. మొదట ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగురవేసి సభకు బయలుదేరాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి ప్రజలు మర్చిపోవడం లేదని, తమ నాయకుడు కేసీఆర్ మళ్లీ రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. సభ కోసం కార్యకర్తలకు రవాణా సౌకర్యం ఇతర సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. అనంతరం రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రావుల రమేశ్, గంప వెంకన్న, మాజీ జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం, ల్యాగల వీరారెడ్డి, మాతంగి లక్ష్మణ్, పాశం అశోక్ రెడ్డి, అనభేరి రాధాకిషన్ రావు, సంగుపట్ల మల్లేశం, బోయిని కొమురయ్య, లక్ష్మణ్, సుధాకర్, శ్రీనివాస్, ప్రభాకర్ సురేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ శ్రేణులు

పండుగ వాతావరణంలో నిర్వహిస్తాం

సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలి

- కరీంనగర్‌లో గోడలకు పోస్టర్లను అతికించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 19 : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో నిర్వహిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లోని కోర్టు రోడ్డులో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న గోడలకు పార్టీ శ్రేణులతో కలిసి అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ నియోజకవర్గం నుంచి వచ్చే వారి కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, మైకెల్ శ్రీను, ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంత్, తిరుపతినాయక్, సంపత్‌రావు, గుగ్గిళ్ల శ్రీనివాస్, మహేశ్, చేతి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా కదలిరావాలి

- బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి
- ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగరేయాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- చొప్పదండి, బూరుగుపల్లిలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం

బూరుగుపల్లిలో సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి/ గంగాధర, ఏప్రిల్ 19: హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊరూరా కదలిరావాలని, కనీవినీ ఎరుగని రీతిలో జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం చొప్పదండి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో, గంగాధర మండలం బూరుగుపల్లిలో ముఖ్యకార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహించగా, సుంకె ముఖ్య అతిథిగా హాజరై ఆయాచోట్ల మాట్లాడారు. పార్టీ ఏ పిలుపునిచ్చినా చొప్పదండి నియోజకవర్గం కార్యకర్తలు ముందుంటారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో ఎలా కొట్లాడామో, అలాగే ఇప్పుడు కాంగ్రెస్ చేస్తున్న పాలనపై ప్రజల పక్షాన నిలబడి ముందుంటున్నామని చెప్పారు. గ్రామాల్లో ఇచ్చిన లక్ష్యం మేరకు జనాన్ని సభకు తరలించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ 25 ఏండ్ల ఉద్యమ గుర్తులు, తెలంగాణ అభివృద్ధిని గుర్తు చేసుకుంటూ నిర్వహిస్తున్న రజతోత్సవ సభలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చొప్పదండి సమావేశంలో మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చిలుక రవీందర్, మాజీ జడ్పీటీసీలు ఇప్పనపల్లి సాంబయ్య, మాచర్ల సౌజన్య- వినయ్ కుమార్, మాజీ సర్పంచులు వెల్మ నాగిరెడ్డి, గన్ను శ్రీనివాసరెడ్డి, యువజన సంఘాల సమితి అధ్యక్షులు బంధారపు అజయ్ కుమార్, నాయకులు ఉన్నారు. బూరుగుపల్లి మీటింగ్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు కంకణాల విజేందర్‌రెడ్డి, వేముల దామోదర్, మడ్లపెల్లి గంగాధర్, యండీ నజీర్, రామిడి సురేందర్ పాల్గొన్నారు.

కేసీఆర్ సైనికులందరూ తరలిరావాలి

- సభను సక్సెస్ చేయాలి
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత
- సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ముఖ్య నాయకుల సమావేశాలు

బీర్‌పూర్‌లో నినాదాలు చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్, నాయకులు

సారంగాపూర్, ఏప్రిల్ 19: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊరూరా కేసీఆర్ సైనికులందరూ భారీగా తరలిరావాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పిలుపునిచ్చారు. శనివారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పర్యటించారు. లక్ష్మీదేవిపల్లిలో, బీర్‌పూర్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించి, మాట్లాడారు. ఎల్కతుర్తిలో 27న నిర్వహించే సభకు ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులకు దిశానిర్దేశం చేశారు. లక్ష్మీదేవిపల్లి గ్రామంలో మహిళలతో ముచ్చటించారు. కేసీఆర్ సభను చూడడానికి తాము కూడా తరలివస్తామని మహిళలు పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలోనే బాగుండేదని పేర్కొంటూ ఆనాటి రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం దావ వసంత బీర్‌పూర్‌లో సభకు సంబంధించిన పోస్టర్‌ను గోడకు అతికించారు. కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, మండలాధ్యక్షులు తెలు రాజు, నేరెల్ల సుమన్ గౌడ్, విండో మాజీ చైర్మన్ మోరుగు రాజేశం, మాజీ ప్రజాప్రతినిధులు భుక్య సంతోష్, పల్లపు వెంకటేష్, బుచ్చి మల్లయ్య, ఆనంద్, బల్మూరి నారాయణరావు, రంగారావు, శ్రీలత శ్రీను నాయక్, ఓడ్నాల లావణ్య జగన్, నాయకులు ఎండబెట్ల ప్రసాద్, సాంబారి గంగాధర్, అరవింద్, బాస్కర్ నాయక్, సుమన్, అత్తినేని నరేశ్, తిరుపతి, సాతాల్ల రమేశ్, నర్సింగ్, రాములు, సతీశ్, రామచంద్రం, కిషన్, రవీందర్, శేఖర్, రామయ్య, మల్కు పాల్గొన్నారు.

కొప్పుల.. 'ఒక ప్రస్థానం'

- ఈశ్వర్ 50 ఏళ్ల విజయగాథపై నేడు పుస్తకాన్ని ఆవిష్కరించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- సాయంత్రం జలవిహార్‌లో పుస్తక పరిచయ సభ

కరీంనగర్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : నిరుపేద కుటుంబంలో పుట్టి కార్మికుడిగా మొదలైన కొప్పుల ఈశ్వర్ రాజకీయ ప్రస్థానం రాష్ట్ర మంత్రి వరకు కొనసాగింది. నిరాడంబరత, నిండైన వ్యక్తిత్వం మూర్తీభవించిన కొప్పుల 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని 'ఒక ప్రస్థానం' పేరుతో పెద్దపల్లికి చెందిన ప్రముఖ రచయిత నూతి మల్లన్న ఒక పుస్తకాన్ని రచించారు. ఆదివారం కొప్పుల ఈశ్వర్ 67వ జన్మదినం సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా హైదరాబాద్‌లో దీనిని ఆవిష్కరిస్తున్నారు. ఇదే రోజు సాయంత్రం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ అధ్యక్షతన పుస్తక పరిచయ సభ కూడా నిర్వహిస్తుండగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొంటున్నారు.

నిరుపేద కుటుంబంలో పుట్టి..

నిరుపేద ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొప్పుల లింగయ్య, మల్లమ్మకు జన్మించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అనేక కష్టాల నుంచి తన జీవన ప్రస్థానాన్ని ప్రారంభించారు. హమాలీగా, బొగ్గు గనుల్లో కూలీగా, చివరికి సింగరేణిలో కార్మికుడిగా చేరి గోదావరిఖనిలో స్థిరపడ్డారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయాలపై ఆయన క్రమంగా విప్లవ కార్మికోద్యమం వైపు మళ్లారు. సీపీఐ ఎంఎల్ అనుబంధంగా ఏర్పాటు చేసిన గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం వ్యవస్థాపక సభ్యుల్లో ఈశ్వర్ ఒకరు. అనేక కేసులు పెట్టినా కార్మిక వర్గ పోరాటాలను మరింత ఉధృతంగా నిర్వహించే వారు. సీపీఐ ఎంఎల్ పార్టీకి అత్యంత సన్నిహితుడైన నిజామాబాద్ జిల్లా రాయకూరుకు చెందిన ఎలవర్తి సుబ్బారావు చిన్న కూతురు కోకిలతో 1982 జూలై 15న వివాహం జరగగా, ఆమె తన పేరును ప్రముఖ విప్లవకారిని స్నేహలతగా మార్చుకున్నారు. విప్లవోద్యమంలో వీరిరువురు కలిసి పని చేసేవారు. 1984లోటీడీపీలో చేరగా, క్రమంగా ఎదుగుతూ 1994లో మేడారం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ టికెట్ పొందారు. ఆ ఎన్నికల్లో ఓడిపోగా.. అటు ఉద్యోగం కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడ్డారు. అయినా, రాజకీయాల్లో స్థిరంగా నిలబడ్డారు. 2001లో కేసీఆర్ నాయకత్వంలో ఏర్పడిన టీఆర్ఎస్‌లో చేరి, 2004 ఎన్నికల్లో గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన కారణంగా మేడారం వదిలి ధర్మపురి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014లో ఈశ్వర్ సేవలను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమించారు. 2018లో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ శాఖ మంత్రిగా కొప్పులకు అవకాశం వచ్చింది. కోట్లాది నిధులు తెచ్చి ధర్మపురి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపారు.

ఎకరాకు రూ.25వేలు అందించాలి

- పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లో పంటల పరిశీలన

వరి పంటను పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 19 : వడగండ్ల వాన, ఈదురుగాలులతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరాకు రూ.25వేలు అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల డిమాండ్ చేశారు. శనివారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి, కోజన్ కొత్తూర్, కేశాపూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలం ముత్యంపేటలో పర్యటించారు. శుక్రవారం రాత్రి కురిసిన వడగళ్ల వాన, ఈదురు గాలులతో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. ఎర్దండిలోని వొడ్డెర కాలనీలో వడగళ్ల వాన, ఈదురు గాలులతో గుడిసెలు దెబ్బతిన్న బాధిత కుటుంబాలను పరామర్శించి, 27 మందికి రూ.3 వేల చొప్పున రూ.81 వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో వడగళ్ల వానతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఎకరాన రూ.25వేలు అందించాలన్నారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావుకు ఫోన్‌చేసి, కోరుట్ల నియోజకవర్గంలో పంటన ష్టాన్ని వివరించారు. అలాగే పంట నష్ట వివరాలను సర్వేచేసి ఉన్నతాధికారులకు పంపించాలని ఏవోకు సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, ఏడీఏ రమేశ్, తహసీల్దార్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్, ట్రాన్స్‌కో ఏడీ మనోహర్, ఏఈ భూమేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు బద్దం గోపి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు దశరథ్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నేమూరి సత్యనారాయణ, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ గారూ.. మా సందేహాలను తీర్చండి

- భూ భారతిలో పలువురు రైతుల విన్నపం
- వీడియో కాన్ఫరెన్స్ ఉందంటూ వెళ్లిపోయిన కరీంనగర్ కలెక్టర్

హుజూరాబాద్‌లో జరిగిన అవగాహన సదస్సులో భూ భారతిపై కలెక్టర్ పమేలా సత్పతిని సందేహాలు అడుగుతున్న రైతులు

హుజూరాబాద్, ఏప్రిల్ 19 : ''కలెక్టర్ గారూ.. భూ భారతిపై మాకు చాలా సందేహాలు ఉన్నాయి.. తీర్చండి'' అంటూ పలువురు రైతులు కోరగా, తమకు వీడియో కాన్ఫరెన్స్ ఉంది అంటూ.. కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంటర్ హాలులో శనివారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఈ ఘటన జరిగింది. కాగా, అవగాహన సదస్సుకు హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, భూభారతి రైతులకు చాలా ఉపయోగపడుతుందని, వాటిని వివరించి సదస్సు ముగించి.. ఆమె వెళ్లిపోతుండగా రైతులు ''మేడం మీరు మాట్లాడిన దాన్ని బట్టి చూస్తే మాకు భూ భారతిలో ఇంకా చాలా సందేహాలు ఉన్నాయి. వాటిని మీకు విన్నవించుకుంటా.. నివృత్తి చేయండి'' అని కోరారు. అయితే, ఆమె సాధ్యమైనంత వరకు వారి సమస్యలను తీరుస్తామని, తమకు వీడియో కాన్ఫరెన్స్ ఉందంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇక చేసేదేమీలేక రైతులు నిరాశతో వెళ్లిపోయారు.

ఐఐటీ-జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అల్ఫోర్స్‌కు ర్యాంకుల పంట

కరీంనగర్‌లోని అల్ఫోర్స్ కళాశాలలో ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైర్మన్ వీ నరేందర్‌రెడ్డి విజయసంకేతం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 19 : ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ర్యాంకులు పంట పండించారని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఐఐటీ నీట్ పోటీ పరీక్షల్లో అల్ఫోర్స్ విద్యార్థులు రాణిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కళాశాలకు చెందిన ఎస్ శరణ్య 49వ ర్యాంకుతో అత్యున్నత స్థానంలో నిలువగా, పీ శ్రీహర్ష 244వ ర్యాంకు, ఎస్ అనిరుద్‌సాయి 272, డీ విశాల్ 329, జే వామిక 350, టీ ప్రణతి 456, అంకిత్సాయి 574 , బీ ఆదిత్య 630, టీ శివాత్మిక 646, వీ హృషికేశ్ 703, మహ్మద్‌అబ్దులాక్ 968, పవార్ తేజ్‌పాల్ 1056, అక్షిత 1148, డీ విశాల్ 1270, ధమష్ 1298, అనురుద్ 1343, శివాని 1378, అర్ సుమిత్‌కుమార్ 1637, డీ కార్తీక్‌రెడ్డి 1826, మహ్మద్ అబ్దుల్ జీవషన్ 1989, బీ విష్ణు 2000వ ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని మరింత ఇనుమడింపజేసినట్లు చెప్పారు. 1000లోపు 11 ర్యాంకులు, 2000లోపు 21ర్యాంకులు, 5000లోపు 40 ర్యాంకులు సాధించగా, 459 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌కు అర్హత సాధించడం గొప్ప విషయమన్నారు. ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో పరీక్ష రాసేందుకు ఎంపికైన విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంతో కోచింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల పట్టుదల, కృషివల్ల అల్ఫోర్స్ ఇంతటి ఘన విజయం సాధించగలిగినట్లు చెప్పారు. ఇక్కడ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రినిటీ విద్యార్థుల అద్భుత ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ మనోహర్ రెడ్డి

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 19 : జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో ట్రినిటీ జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చినట్లు విద్యా సంస్థల ఫౌండర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిర్దిష్టమైన ప్రణాళిక, ఉన్నతమైన విద్యా బోధన, నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఈ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులలో నిగూఢమై ఉన్న శక్తిని వెలికి తీయడానికి అన్ని మార్గాలు, పద్ధతులు పాటించినట్లు చెప్పారు. అందుకు సహకరించిన తల్లిదండ్రులు, శిక్షణ అందించిన అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఈ క్రమంలోనే ఏ రఘుపతి జాతీయ స్థాయిలో 138వ ర్యాంకు, ఏ హేమంత్ 162, డీ సాయిచరణ్ కుమార్ 313, ఎస్ పరమేశ్వర రెడ్డి 344, ఏ ఫనీందర్ 409, ఆర్ సాయికిశోర్ 587, వీ అదీప్ 751, డీ మహేశ్ 974, ఆర్ మనోజ్ 1262, బీ సిద్ధిక 1551 సాధించగా, కరీంనగర్ ఒకే బ్రాంచ్ నుంచి 1000లోపు 8 ర్యాంకులతో పాటు, పరీక్షకు హాజరైన విద్యార్థులలో 83 శాతం మంది ఉత్తమ ర్యాంకులతోపాటు జేఈఈ అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించారన్నారు. ట్రినిటీ కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ర్యాంకుల సాధన కేవలం ట్రినిటీ కళాశాలలకే సాధ్యమని, ఉత్తమ విద్యాబోధన అందించడంలో ట్రినిటీ యాజమాన్యం, అధ్యాపకులు ఎప్పుడు ముందుంటారని తెలిపారు.

శ్రీ చైతన్య విద్యాసంస్థల ప్రభంజనం

విద్యార్థులను అభినందిస్తున్న రమేశ్ రెడ్డి తదితరులు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 19 : జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో జాతీయ స్థాయిలో కరీంనగర్ శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుత ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలకు చెందిన రోహిత్ 17, టీ కుందన్ 814, పీ ఈశ్వర్ ముఖేష్ 1275, ఎం అంజలి 2575, బీ అక్షర 2992, ఎం తరుణ్ 5949, జీ నందిని 7464 ర్యాంకు, 20 వేల లోపు 15 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. జేఈఈ మెయిన్స్‌కు హాజరైన వారిలో 40 శాతం విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు క్వాలిఫై అయినట్లు చెప్పారు. అనునిత్యం పర్యవేక్షణ, విద్యార్థులలో ఆత్మస్థైర్యం నింపడం వల్ల ఇంతటి ఘన విజయం సాధించగలిగినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

'సప్తగిరి' దవాఖాన రిజిస్ట్రేషన్ రద్దు

- సీఎంఆర్ఎఫ్ నిధులు స్వాహా చేసినట్లు నిర్ధారణ
- నోటీసులు జారీ చేసినప్పటికీ జమ్మికుంటలో నడుస్తున్న దవాఖాన?
- ఉన్నతాధికారుల ఆదేశాలతో రంగంలోకి జిల్లా అధికారులు
- తనిఖీలు నిర్వహించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు

జమ్మికుంట పట్టణంలోని సప్తగిరి దవాఖాన సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

జమ్మికుంట, ఏప్రిల్ 19 : సీఎంఆర్ఎఫ్ స్కాంకు పాల్పడిన కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని సప్తగిరి ప్రైవేట్ దవాఖాన రిజిస్ట్రేషన్ రద్దైంది. సదరు దవాఖానకు చెందిన వైద్యులు, రోగులకు చికిత్స చేయకపోయినా.. చేసినట్లు నకిలీ బిల్లులు సృష్టించి సీఎంఆర్ఎఫ్ నుంచి నిధులు స్వాహా చేశారనే ఫిర్యాదుల నేపథ్యంలో సీఐడీ అధికారులు 2022-23లో కేసు నమోదు చేశారు. పలుసార్లు విచారణ చేసిన సంగతి తెలిసిందే. విచారణలో స్కాం నిజమేనని నిర్ధారణకు వచ్చారు. దీంతో జమ్మికుంట పట్టణంలోని సప్తగిరి దవాఖాన రిజిస్ట్రేషన్‌ను (అనుమతులు)ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఈ మేరకు మూడు రోజుల క్రితమే దవాఖాన నిర్వాహకులకు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ నుంచి గుర్తింపు రద్దు చేస్తూ నోటీసులు జారీ అయ్యాయి. అయితే, నోటీసులు అందుకున్నప్పటికీ సదరు దవాఖాన నిర్వాహకులు దవాఖానను నడిపిస్తున్నారే సమాచారం మేరకు ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో డీఎంహెచ్‌వో సూచనల మేరకు హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం సప్తగిరి దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేసి, పరిశీలించారు. ఈ సమయంలో వైద్యులు, నిర్వాహకులు ఎవరూ అందుబాటులో లేరు. వార్డులు, చికిత్స, తదితర గదులను చూశారు. రికార్డులు పరిశీలించారు. కాగా, 'సప్తగిరి' అనుమతులు రద్దు, సీజ్‌పై డిప్యూటీ డీఎంహెచ్‌వోను వివరణ కోరగా.. సీఎంఆర్ఎఫ్ నిధుల స్వాహా జరిగింది నిజమేనని నిర్ధారణకు వచ్చామని, సప్తగిరి అనుమతులు కూడా డీఆర్ఏ నుంచి రద్దు చేస్తున్నట్లు నోటీసులు కూడా జారీ చేశామని చెప్పారు. దవాఖాన నిర్వాహకులకు నోటీసులు అందాయన్నారు. త్వరలో సీజ్ కూడా చేస్తామని చెప్పుకొచ్చారు. దవాఖాన నడిపించినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో సిబ్బంది ప్రతాప్, నరేందర్, రాజు ఉన్నారు.